
సాక్షి ఒడిశా

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,29,503
బంగారం	15 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి	271 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

శక్తి పీఠాల్లో స్వర్ణ శోభ



రాష్ట్రవ్యాప్తంగా షోడశ దిన్మాతక పూజలతో ప్రముఖ శక్తి పీఠాలు బంగారు శోభతో కళకళలాడుతున్నాయి.

- 8లో▸

వివాహ రిజిస్ట్రేషన్‌కు ఎమ్మెల్యే బిజయ్ శంకర్ దరఖాస్తు



తిర్తోల్ నియోజకవర్గం బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే బిజయ్ శంకర్ దాస్ వివాహ నమోదు కోసం దరఖాస్తు దాఖలు చేయడంతో దుమారం చెలరేగింది.

- 8లో▸

న్యూస్‌రీల్

స్కూల్ బస్సుల తనిఖీలు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

రాయగడ: రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ అధికారులు గత రెండు రోజులుగా స్కూల్ బస్సుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బస్సులకు సంబంధించిన పర్మిట్, ఫిట్‌నెస్, అనుమతి తదితర ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జనకేతన్ బొరానాగొరాయా ఆధ్వర్యంలో శనివారం వివిధ ప్రాంతాల్లో 12 బస్సులను తనిఖీలు చేయగా, వాటిలో 6 బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ పత్రాలు లేకపోవడంతో, రూ.65 వేల అపరాధ రుసుము విధించారు. అదేవిధంగా పట్టణంలో నో పార్కింగ్ ఏరియాలో ఉంచిన వాహనాలపై సైతం దాడులు నిర్వహించారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లను చూపిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

బరంపురం: గంజాం జిల్లా హింజిలికాట్‌లో కొద్దికాలంగా రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడి చేశారు. ఐఐసీ అధికారి అభిమన్య దాస్ తెలిపిన వివరాల మేరకు.. హింజిలికాట్ పోలీసుస్టేషన్ పరిధి సున్నారికొండి గ్రామంలోని ఒక ఇంటిపై జూదం అడ్డా నడుస్తోందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి జూదం అడ్డాపై శనివారం దాడులు చేపట్టి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి దగ్గర నంచి 7 సెల్‌ఫోన్లు, రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

10 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖైయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ వద్ద గంజాయి అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో బలిమెల ఐఐసీ అజిత్ సింగ్ బహిరా తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో అతివేగంగా వచ్చిన పికప్ వ్యాన్ పోలీసులను చూసి సునగాఢ్ ఘాట్ రోడ్డు నుంచి వెళ్లేందుకు టర్న్ తీసుకుంది. దీంతో సినిమా తరహాలో సుమారు 5 కిలోమీటర్లు పోలీసులు పికప్ వ్యాన్‌ను చేజ్ చేశారు. దీంతో కుడుములగుమ్మ ప్రాంతంలో వాహనాన్ని విడిచిపెట్టి డ్రైవర్ సమీప అడవిలోకి పరారయ్యాడు. మరోవ్యక్తి పక్కనే ఉన్నటువంటి కాలువలో పడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, కాలువలో పడిపోయిన వ్యక్తిని చికిత్స నిమిత్తం కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వ్యాన్‌లో పట్టుబడిన గంజాయిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. శనివారం గంజాయిని తూకం వేయగా 10 క్వింటాళ్లు ఉంది. నిందితుడి ఆరోగ్యం కుదుటపడితే వివరాలు సేకరించి కోర్టులో హాజరపరుస్తామని అజిత్ సింగ్ తెలియజేశారు. పరారైన నిందితుడి కోసం గాలిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పికప్ వ్యాన్

• మహిళల కన్నెర్ర

• సారా దుకాణంపై దాడి





దుకాణంపై దాడి చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) దుకాణం బయట వేసిన సారా ప్యాకెట్లు, ఇతర సామగ్రి

బరంపురం: గంజాం జిల్లా కుకుడాఖండి బ్లాక్ పరిధి సింహాళి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ లైసెన్స్‌డ్ నాటుసారా దుకాణంపై మహిళలు దాడి చేసిన ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గోళంతరా పోలీసుస్టేషన్ పరిధి సింహాళి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ లైసెన్స్‌డ్ సారా దుకాణం ఉంది. గ్రామంలో దుకాణం తీసివేయాలని స్థానిక మహిళలు పలుమార్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించి వందలాది మహిళలు శనివారం ర్యాలీగా వెళ్లి దుకాణంపై దాడి చేశారు. దుకాణంలో ఉన్నటువంటి సారా ప్యాకెట్లు, సామగ్రి బయట వేసి నిప్పు పెట్టారు.



మద్యం దుకాణం దగ్గరికి భారీ ర్యాలీగా వెళ్తున్న మహిళలు

యువతకు స్ఫూర్తి అమిత్ రోహిదాస్

• సీఎం నవీన్ పట్నాయక్
• హాకీ స్టార్‌కు రూ.1.5 కోట్ల నగదు పురస్కారం ప్రకటన



స్వర్ణ పతాకంతో అమిత్ రోహిదాస్

భువనేశ్వర్: హాంగ్‌జౌలో జరిగిన 19వ ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు చారిత్రాత్మక స్వర్ణ పతకం సాధించడంలో ముఖ్యమైన పాత్ర పోషించిన హాకీస్టార్ అమిత్ రోహిదాస్‌కు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం రూ.1.5 కోట్లు నగదు పురస్కారం ప్రకటించారు. ఈ సందర్భంగా రోహిదాస్‌కు ముఖ్యమంత్రి తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. యువతకు స్ఫూర్తిగా నిలిచిన అతని అద్భుతమైన ప్రతిభకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రకటించినట్లు వెల్లడించారు. ఒడిశాలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా యువకులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. రోహిదాస్ ప్రతిభపై గర్వపడుతున్నట్లు తెలిపారు.

☛ సుందర్‌గడ్ ముద్దుబిడ్డ రోహిదాస్

రాష్ట్రంలో హాకీ సంపన్న ప్రాంతమైన సుందర్‌గడ్ ముద్దుబిడ్డ అమిత్ రోహిదాస్. టోక్యో ఒలింపిక్స్–2020లో కాంస్య పతకాన్ని చేజిక్కించుకుని గర్వ కారణంగా నిలిచాడు. అతను రౌర్కెలా స్పోర్ట్స్ హాస్టల్‌లో తన అసాధారణ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. 150కి పైగా క్యాప్స్‌తో ఆకట్టుకునే ట్రాక్ రికార్డ్‌తో, అమిత్ హాంగ్‌జౌలో భారతదేశం జట్టు ప్రచారంలో ఒక సమగ్ర కోగ్‌గా ఉద్భవించాడు. మొదటి రషర్‌గా మరియు విశేషమైన వ్యూహాత్మక చతురతను ప్రదర్శించాడు. కొరియాతో జరిగిన సెమీ–ఫైనల్‌లో అతని కీలకమైన గోల్, భారత జట్టును ఫైనల్‌కు మరియు ప్రతిష్టాత్మకమైన బంగారు పతకం సాధించడంలో ముందంజలో నిలిపింది.

తీర్థయాత్రలకు 1000 మంది వృద్ధులు



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

• గంజాం కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా

బరంపురం: రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐదు జిల్లాలకు చెందిన 1000 మంది వృద్ధులను తీర్థయాత్రలకు పంపనున్నట్లు జిల్లా కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా తెలియజేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశంతో ఈనెల 31వ తేదీన గంజాం, గజపతి, కొందమాల్, బౌద్ మరియు నయాగడ జిల్లాలకి చెందిన 1000 మంది సీనియర్ సిటిజన్లను ప్రభుత్వం తరపున తీర్థయాత్రలకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. 31వ తేదీన బరంపురం రైల్వేస్టేషన్ నుంచి కన్యాకుమారి, త్రివేండ్రం చుట్టుపక్కల తీర్థయాత్రలు ముగించుకొని తిరిగి నవంబర్ 5వ తేదీన బరంపురం చేరుకుంటారని వివరించారు. తిరిగి రెండో విడతలో 2024 జనవరి 17వ తేదీన వారణాసి మరియు ప్రయాగ చుట్టుపక్కలా తీర్థయాత్రలు ముగించుకొని, మరలా 22వ తేదీన బరంపురం చేరుకోనున్నట్లు వెల్లడించారు.

ఐఐసీ అధికారిగా రేవతి సబర్



రేవతి సబర్

బరంపురం: స్థానిక నిమ్మఖండి పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా రేవతి సబర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇదివరకు కొందమాల్ జిల్లా రైకియా పోలీసు స్టేషన్ ఐఐసీగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను సక్రమంగా కాపాడడానికి అందరి సహకారం అవసరమని కోరారు.

'వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత'



మాట్లాడుతున్న బాబిలత సరఫ్, వేదికపై అశోక్, గౌరంగ్ రౌత్ తదితరులు

రాయగడ: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని స్థానిక అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత సరఫ్ అన్నారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం అడవులు అంతరిస్తుండడంతో వన్యప్రాణులు సైతం కనుమరుగువుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చదనంతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని పేర్కొన్నారు. అడవులను సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఎక్కడైనా వన్యప్రాణులు తారాసపడితే వాటిని అంతమొందించకుండా సురక్షితంగా అడవుల్లో విడిచిపెట్టే ప్రయత్నం చేయాలని సూచించారు. వైల్డ్ లైఫ్ పార్టనర్ గౌరంగ రౌత్ మాట్లాడుతూ.. వన్యప్రాణుల రక్షణ కోసం మానవ సమాజం విధులు, బాధ్యతలను తెలియజేశారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణలో సేవలందిస్తున్న జేకేపూర్‌కు చెందిన గజేంద్ర ఉమా శంకర్, రాయగడకు చెందిన ప్రదీప్ నాయక్‌లను సన్మానించారు. సమావేశంలో ఏసీఎఫ్ అశోక్ కుమార్ ప్రధాన్, అదనపు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది, కళాశాల విద్యార్థులు

రాష్ట్రానికి సరోజ్ మృతదేహం

• నివాళులర్పించిన ప్రముఖులు



సరోజ్ దాస్ శవపేటిక వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



బాధిత కుటుంబ సభ్యుడిని ఓదార్చుతున్న సీఎం

భువనేశ్వర్: విధి నిర్వహణలో ఉండగా సిక్కిం వరదల్లో మరణించిన అమర జవాన్ సరోజ్ కుమార్ దాస్ మృతదేహం శనివారం ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ విమానాశ్రయానికి చేరింది. రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) పలువురు ఉన్నతాధికారులు విమానాశ్రయంలో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ప్రజా పనుల శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రఫుల్ల మల్లిక్, ఢెంకనాల్ లోక్‌సభ సభ్యుడు మహేష్ సాహు సైతం అమరవీరునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

☛ స్వగ్రామానికి తరలింపు

ఢెంకనాల్ జిల్లా కెందుఢిప్పా అమర జవాన్ స్వగ్రామం. ప్రభుత్వ లాంఛనాలతో జవాను శవపేటికను స్వగ్రామానికి తరలించారు. ఆయన భౌతికకాయాన్ని ఊరేగింపుగా స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఆయన అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో స్వగ్రామం శ్మశానవాటికలో నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సిక్కింలో ఆకస్మిక వరదల్లో గల్లంతైన 23 మంది సైనికుల్లో దివంగత సరోజ్ కుమార్ దాస్ ఒకరు. అనంతరం అతడి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అతడిని గుర్తించారు. సరోజ్‌కు 7 నెలల క్రితం వివాహమైంది. భారత సైన్యంలో హవల్దార్‌గా పని చేశారు. అతను 2012 సంవత్సరంలో భారత సైన్యంలోని కార్ప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఈఎంఈ) విభాగంలో భర్తీ అయ్యాడు.



సరోజ్‌దాస్ మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న గవర్నర్ గణేషీ లాల్

నూతన కార్యవర్గం ఏర్పాటు



అమియ కుమార్ స్వాయి



సర్మిష్టా పాడి



అవినాష్ బిసోయి



బార్జి జగన్‌మోహన్‌రావు

రాయగడ: జిల్లా బీజేడీ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజేషనల్ కార్యదర్శి ప్రణవ్ ప్రకాష్ (బొబి) దాస్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బీజేడీ రాష్ట్ర శాఖ కార్యదర్శిగా అమియ కుమార్ స్వాయి నియమితులయ్యారు. అదేవిధంగా బీజేడీ చత్రో జనతాదళ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడిగా బిష్ణు ప్రసాద్ పండ నియమితులయ్యారు. అలాగే బీజేడీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సర్మిష్ట పాడి, బిజూ యువ జనతాదళ్ జిల్లా అధ్యక్షుడిగా అవినాష్ బిసోయి, బిజు ఛత్ర జనతా దళ్ జిల్లా అధ్యక్షుడిగా నేత్రానంద సబర్, రాయగడ అసెంబ్లీ నియోజకవర్గం అబ్జర్వర్‌గా రంజిత్ రాయ్, బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం అబ్జర్వర్‌గా ప్రశాంత్ నాయక్, గుణుపూర్ నియోజకవర్గం అబ్జర్వర్‌గా గ్యానేంద్రగిరి గోస్వామి, కో–ఆర్డినేటర్‌గా ఇమ్రాన్ ఖాన్, రాయగడ పట్టణ శాఖ అధ్యక్షుడిగా బార్జి జగన్‌మోహన్‌రావులను నియమించినట్లు వెల్లడించారు. కొత్త కార్యవర్గానికి బీజేడీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

మరమ్మతుల పనులకు గ్రీన్ సిగ్నల్



రాయగడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి

రాయగడ: పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి మరమ్మతులతో పాటు జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి నాగావళి నదిపై ఉన్న వంతెన మరమ్మత్తుల కోసం సుమారు రూ.3.15 కోట్లతో డీపీఆర్ సిద్ధమయ్యింది. ఈ మేరకు సంబంధిత శాఖ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించడంతో ప్రభుత్వం నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, త్వరలో దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని జాతీయ రహదారుల విభాగం (నేషనల్ హైవే శాఖ) అసిస్టెంట్ ఇంజినీర్ విక్రం పాణిగ్రాహి తెలియజేశారు. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాయగడ పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పై స్లాబ్ పూర్తిగా పాడవ్వడంతో కొత్తగా నిర్మించాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ సమస్యను నివారించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 1998వ సంవత్సరంలో ఈ బ్రిడ్జిని నిర్మించింది. దాదాపు 25 ఏళ్లు పూర్తి కావడంతో బ్రిడ్జి మరమ్మతులకు గురయ్యింది. ఈ మేరకు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో, వచ్చే ఏడాది 2023–24 బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అదేవిధంగా జేకేపూర్‌లోని నాగావళి నదిపై ఉన్నటువంటి వంతెన పనులు సైతం త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు.

ఆస్పత్రి నిర్మించాలని ఆందోళన



రోడ్డుపై మంటలు వేసి ఆందోళన తెలుపుతున్న గ్రామస్తులు

జయపురం: స్థానిక రాణిగడ్ పంచాయతీ బలిపూజారిపుట్‌లో ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని కోరుతూ పంచాయతీలోని 5 గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చేపట్టారు. బీజేపి రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్ నేతృత్వంలో వందలాదిమంది ప్రజలు బొరిగుమ్మ–కొరాపుట్ రహదారిలో 5 గంటల పాటు రస్తారోకో నిర్వహించారు. గ్రామ సమీపంలోని రోడ్డుకు అడ్డంగా కట్టెలు వేసి నిప్పు పెట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వైద్య విభాగ అధికారి బిశ్వరంజన్ షాడంగి సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ముందు నిర్ణయించిన ప్రకారం ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత సామంతరాయ్ మాట్లాడుతూ ఆస్పత్రి నిర్మాణానికి బలిపూజారిపుట్ అనువైన ప్రాంతమన్నారు. ఆస్పత్రి నిర్మాణానికి 5 ఎకరాల స్థలం ఎంపిక చేయడంతో ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. అనంతరం టెండర్లు కూడా పిలిచారని వెల్లడించారు. అయితే ఆ తర్వాత కాలంలో టెండర్ రద్దుచేసి, మంజూరైన నిధులను గ్రామ అభివృద్ధి సంస్థకు తరలించారని మండిపడ్డారు. ప్రతిపాదిత ఆస్పత్రి నిర్మాణాన్ని మరో ప్రాంతానికి తరలించేందుకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశాడు. ఏ పరిస్థితుల్లోనూ ఇతర ప్రాంతానికి తరలించేందుకు అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అసలు మొదట పిలిచిన టెండర్లు ఎందుకు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏకారణం చేతనైనా ఆస్పత్రిని బలిపూజారిపుట్‌లో నిర్మించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఫ్రీజర్ బాక్సులకు రూ.లక్ష విరాళం



చెక్కును అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ రెండు శీతలీకరణ శవపేటికలు (ఫ్రీజర్ బాక్సులు) కొనుగోలు చేసేందుకు శనివారం త్రిపురాన రామకృష్ణ, నీలవేణి, ఇందిర సౌజన్యంతో చిక్కాల సుభాషిణి (రిటైర్డ్ తహసీల్దారు) రూ.1,04,000 సాయాన్ని అందించారు. అలాగే నిత్యాన్నదానం కోసం రూ.5వేల విలువైన చెక్కును విశ్రాంత జాయింట్ కలెక్టర్ ఆర్.రజనీకాంతరావు చేతుల మీదుగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బి.చిన్మయరావు, మల్లా కల్యాణచక్రవర్తి, నిక్కు హరిసత్యనారాయణ పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఇంటర్ సర్టిఫికెట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంబంధించి ఒరిజినల్ మార్క్స్ మెమోలు/పాస్ సర్టిఫికెట్లు జిల్లాకు చేరుకున్నాయి. వీటిని త్వరితగతిన విద్యార్థులకు అందజేసేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు/ప్రతినిధులు ఇంటర్ మార్క్స్ మెమోలను ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లాలని ఆర్ఐఓ పి.దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న ధర్మారావు కుటుంబ సభ్యులు

టెక్కలి రూరల్: స్థానిక కంచ్ర వీధికి చెందిన నాగుల ధర్మారావు(31) మృతికి కారకులైన వారిని శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 4న మద్యం అధికంగా సేవించడంతో ధర్మారావు మృతిచెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారని, వాస్తవంగా అతనితో కలిసి వెళ్లిన వారే చంపి ఉంటారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్ఐ ఎల్.రామకృష్ణ శిబిరం వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి ఇళ్లకు పంపించారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ ఎంపికలు



వివిధ క్రీడల్లో ఎంపికైన బాలికలు

టెక్కలి: అండర్ –19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు శనివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉల్లాసంగా జరిగాయి. స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎస్.రమణ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ తదితర క్రీడల్లో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.నారాయణరావు, కబడ్డీ జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, పీడీలు చరణ్, ఎన్.రమేష్, కె.కె.రామిరెడ్డి, కె.ప్రకాశ్, లక్ష్మణరావు, రాజా, వై.వెంకటరమణ, ఆదిశేషు, కె.రఘునాథరావు తదితరులు పర్యవేక్షించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పొందూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం షాలీమార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించాడని, వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీ నంబర్ 70132 73731కి తెలియజేయాలని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

చెల్లిని బాగా చూడటం లేదని బావపై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : తమ చెల్లిని బాగా చూడటం లేదంటూ బావపై దాడి చేసిన ఘటన శ్రీకాకుళం నగరంలో చోటుచేసుకున్నట్లు రెండో పట్టణ ఎస్ఐ కె.లక్ష్మి పేర్కొన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం బలివాడ గ్రామానికి చెందిన అలిగి రమణ సీమ్యాన్‌గా ఉంటూ అదే గ్రామానికి చెందిన పెంట రాజారావు కుమార్తె అమరావతిని 13 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. పిల్లలు లేరు. రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో అమరావతి తన కన్నవారింటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీకాకుళంలో తన చెల్లెలు అమరావతి పేరుతో ఉన్న కారును సాయి తీస్తుండగా.. ఆ కారు తాను కొన్నానని రమణ అడ్డుగా వెళ్లడంతో కాలికి గాయమైంది. చెల్లిని సరిగా చూడటం లేదంటూ సాయి, ఆమె తండ్రి రాజారావు, అమరావతిలు తనపై దాడి చేసినట్లు రమణ పేర్కొనడంతో కేసు నమోదు చేశామని లక్ష్మి తెలిపారు.

• హృదయ విదారకం



భార్య మృతదేహాన్ని రిక్షాలో గ్రామానికి తరలించిన హృదయ విదారకర ఘటన భద్రక్ జిల్లా సారో మండలం దొడిసాద పంచాయతీలో చోటుచేసుకుంది. పంచాయతీలోని చౌపులియా గ్రామానికి చెందిన గురుబా సింఘ్ భార్య మమత సింఘ్ అనారోగ్యానికి గురవ్వడంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అయితే ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. తదనంతరం అంత్యక్రియల కోసం శ్మశానానికి తరలించేందుకు బాధిత భర్త అంబులెన్స్ కోసం ఆస్పత్రి వర్గాలను విన్నవించినా కనికరించలేదు. మృతదేహాల రవాణాకు అంబులెన్సులు అనుమతించరని దాటవేశాయి. ప్రైవేటు వాహనంలో రవాణా కోసం సంప్రదించగా రూ.1,500 డిమాండ్ చేశారు. దీంతో అంత చెల్లించే స్థోమత లేకపోవడంతో ట్రాలీ రిక్షాపై మృతదేహాన్ని తరలించాడు.

– భువనేశ్వర్

ఎమ్మెల్యే ప్రతాప్ జెనాకు కోర్టు సమన్లు

భువనేశ్వర్: కటక్ జిల్లా మహంగా జంట హత్యల కేసులో అధికార పక్షం బీజేడీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ జెనాపై శిక్షార్హమైన కేసు ఉందని ఇటీవల ధ్రువీకరించిన విషయం తెలిసిందే. ఈ ధ్రువీకరణ ఆధారంగా కటక్‌లోని కోర్టులో ప్రత్యక్షంగా హాజరు కావాలని సమన్లు జారీ అయ్యాయి. కేసు విచారణ ఈనెల 31వ తేదీకి వాయిదా పడింది. కటక్ జిల్లా సాలేపూర్ ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ (జేఎంఎఫ్‌సీ) కోర్టు శుక్రవారం ఎమ్మెల్యేకు సమన్లు జారీ చేసింది. ఈ సమన్ల ప్రకారం ఈనెల 31న ఎమ్మెల్యే కోర్టులో ప్రత్యక్షంగా హాజరు కావాల్సి ఉంది. కేసులో దాఖలైన పిటిషన్‌ను పరిశీలించిన మేరకు సెప్టెంబర్ 25న కోర్టు శిక్షార్హమైన కేసుగా ధ్రువీకరించింది. ఫిర్యాదుదారు, సాక్షుల వాంగ్మూలాలు మరియు రికార్డులో అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పరిశీలించిన తర్వాత, భారతీయ శిక్షాస్మృతిలోని 302, 506, 120 బి సెక్షన్‌ల కింద నేరాలకు నిందితుడు ప్రతాప్ కుమార్ జెనాపై శిక్షార్హుడుగా ప్రాథమిక కేసు వివరాలు స్పష్టం చేసినట్లు న్యాయస్థానం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను భువనేశ్వర్‌లోని ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని తెలిపింది. 2021 సంవత్సరం జనవరి 2న మహంగా ప్రాంతంలో బీజేపీ నాయకుడు కులమణి బొరాల్ మరియు అతని సహచరుడు దివ్యసింగ్ బొరాల్‌ల హత్య కేసులో బీజేడీ ఎమ్మెల్యే నిందితుడుగా చిక్కుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రఫుల్ల బిస్వాల్ టంగి గోవింద్‌పూర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

• ప్రసవ 'వే'దన



ప్రపంచం 5జీ స్పీడ్‌తో దూసుకెళ్తున్నా రహదారి సౌకర్యానికి నోచుకోని గ్రామాల ప్రజలు ఇంకా అష్టకష్టాలు అనుభవిస్తూనే ఉన్నారు. కెంజొహర్ జిల్లా ఘసిపురా మండలం షముకనండీ పంచాయతీ పొతాన్ డాహీ గ్రామంలో కనిపించిన వాస్తవ దృశ్యం ఇది. పురిటి నొప్పులతో ప్రసవ వేదన అనుభవిస్తున్న గర్భిణిని ఇలా మంచంపై ఆస్పత్రికి తరలించారు. గ్రామం ఆవతలి వైపునకు వెళ్లాలంటే ఈవిధంగా కాలువ గుండా 4 కిలోమీటర్లు కాలి నడకన దాటాల్సిందే. గ్రామస్తులు సురక్షితంగా కాలువ దాటేందుకు వంతెన సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– భువనేశ్వర్




స్వర్ణాలంకారంలో చవులియా గంజ్ జయదుర్గ



స్వర్ణ శోభిత కటక్ చండీమాత



కాకత్‌పూర్ మాత మంగళ స్వర్ణ సోయగం



స్వర్ణకాంతులీనుతున్న జాజ్‌పూర్ విరజా మాత

శక్తి పీఠాల్లో స్వర్ణ శోభ

- రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన షోడశ దినాత్మక పూజలు
- పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు
- విజయ దశమి వరకు కొనసాగనున్న పూజలు



పురోహితులను సత్కరించిన పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా షోడశ దిన్మాతక పూజలతో ప్రముఖ శక్తి పీఠాలు బంగారు శోభతో కళకళలాడుతున్నాయి. తొలిరోజు పీఠాల్లో అధిష్ఠాన దేవతలకు సహస్ర కుంభాభిషేకం నిర్వహించి మర్నాడు దేవతలకు స్వర్ణ అలంకారం చేశారు. ఈ నేపథ్యంలో పలు పీఠాల్లో భక్తులకు శక్తి స్వరూపిణి బంగారు శోభతో దర్శనమిచ్చింది. పూరీ శ్రీజగన్నాథ్ దేవస్థానం సముదాయంలో నెలకొన్న విమలా దేవి పీఠంలో షోడశ దినాత్మక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవీకి సహస్ర కుంభాభిషేకం అత్యంత ఘనంగా నిర్వహించడం విశేషం. శ్రీ మందిరంలో దుర్గామాధవ్ ఉపాసన నిర్వహిస్తారు. ఈ పూజలు రెండు విడతలుగా నిర్వహిస్తారు. తొలి 8 రోజులు విమలా శక్తి పీఠంలో దుర్గాదేవి, కాలపురుషోత్తం దేవ్ కొలువుదీరి పూజలందుకుంటారు. మిగిలిన 8 రోజులు డోలో మండప వీధి నారాయణి మందిరంలో దుర్గాదేవి, కాలపురుషోత్తం దేవుని ఉత్సవ విగ్రహాలు పూజలందుకుంటాయి. ఈ 8 రోజులు నిత్యం పల్లకిలో ఉత్సవమూర్తుల్ని (దుర్గ, కాలపురుషోత్తమ దేవుడు) నారాయణి పీఠానికి ఊరేగింపుగా తరలిస్తారు. ఈ ఆవరణలో కర్పూర హారతి సమర్పించి ఆలయం లోపలికి ఉత్సవమూర్తుల్ని తరలిస్తారు. దైనందిన పూజాదులు చేయడంతో నిత్య నైవేద్యం వగైరా సేవాదుల్ని ముగించి చందన సేవ పూర్తి కావడంతో తిరిగి పల్లకిలో శ్రీ మందిరం భండార మండపానికి తరలిస్తారు. ఇలా విజయ దశమి (దసరా) వరకు నిత్యం దుర్గామాధవుల్ని పూజిస్తారు.

శ్రోతీయ బ్రాహ్మణులకు ప్రత్యేక ఆహ్వానం

శ్రీమందిరం సముదాయం లోపలి ప్రాకారంలో నెలకొన్న విమలా దేవికి షోడశ దిన్మాతక పూజాదుల నిర్వహణ కోసం బ్రాహ్మణులకు పూరీ గజపతి మహారాజు ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. గజపతి మహారాజు చేతితో తాకిన వక్క, టెంకాయ రాజ గురువు పురోహితులకు అందజేయడం ఆచారం. గజపతి మహారాజు ప్రతినిధిగా రాజ గురువు ఈ వక్క, టెంకాయ బ్రాహ్మణులకు ఇస్తారు. శ్రీమందిరం విమలా శక్తి పీఠంలో షోడశ దినాత్మక పూజాదులు నిర్వహించే అర్చకులు, పరిచ్ఛా వర్గీయులు, చండీ స్తోత్ర పాఠకులు, మంత్ర, జపం ఉపాసకులు, సహస్ర నామ పారాయణం చేసేవారు ఉంటారు.

అర్చకులకు సత్కారం

శ్రీమందిరం లోపలి ప్రాకారంలో ఉన్న మా భువనేశ్వరి, మా బట్టొ మంగళ మరియు మా ఉత్తరాయణి పీఠాలలో చండీస్తోత్ర పారాయణం ఇతరేతర షోడశోపచార పూజాదుల నిర్వహణకు నియమితులైన ప్రత్యేక అర్చకులకు గజపతి మహారాజు సత్కారం లభిస్తుంది. శ్రీక్షేత్రం పరిసరాల్లో వివిధ శక్తి పీఠాలైన దక్షిణ కాళీ, ఆలమ్ చండీ, మరియు కపిలేశ్వర్‌పూర్‌లో పంచముఖి అమ్మవారి ఆలయాల్లో షోడశ దినాత్మక పూజలు ప్రారంభించారు. ఈ ఆలయాల్లో శ్రీ మందిరం తరహాలో అర్చకులు, ఉపాసకులు నియమితులవుతారు. కటక్, జాజ్‌పూర్, భుషండపూర్, కాకత్‌పూర్, ఘుట్గొగాంప్, సంబలపూర్ తదితర ప్రాంతాల శక్తి పీఠాల్లో సైతం షోడశ దినాత్మక పూజలు ప్రారంభమయ్యాయి.

కస్సుబుస్సులకు టాటా..!

- ప్రయాణికుల పట్ల మరింత మర్యాద
- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సిలింగ్
- వారంలో ఒకరోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో నిర్వహణ
- ప్రైవేటు వాహనాలవైపు ప్రయాణికులు చూడకుండా చర్యలు





ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్ : ఆర్టీసీ బస్సుల్లో కొందరు కండక్టర్లు, డ్రైవర్ల ప్రవర్తనపై తరచూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పని ఒత్తిడి, ఇతర కారణాలు ఏవైతేనేం ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంబోధిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, సరిగ్గా సమాధానం ఇవ్వడం లేదంటూ ఆర్టీసీ ఫిర్యాదుల విభాగానికి కంప్లైంట్స్ అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల పట్ల ఆర్టీసీ సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ప్రయాణికుల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు

ఫిర్యాదులపై సీరియస్..

ప్రయాణికులు ఆపమన్నచోట బస్సు ఆపాలని, బస్సు ఎక్కేందుకు చేయి ఎత్తినచోట బస్సును నిలపాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు కండక్టర్లకు, డ్రైవర్లకు సభలు, సమావేశాలు నిర్వహించిన ప్రతిసారీ చెబుతున్నప్పటికీ ఫలితం ఉండటం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. కొన్ని సందర్భాలలో టికెట్ ఇచ్చే సమయంలో చిల్లర సమస్య ఏర్పడి ప్రయాణికులతో వాదనలు పెట్టుకుంటున్నారని అధికంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. దీనిపై కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సిలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది.

విజయనగరంలో కౌన్సిలింగ్..

ఆర్టీసీ జోన్–1కు సంబంధించి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలోని ఆర్టీసీ డిపోలలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్‌లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో కౌన్సిలింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటలు చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి వచ్చిన నిపుణులు, అధ్యాపకులు, అడ్వకేట్లను రప్పించి సహృద్భావ వాతావరణంలో కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నారు.

ఓఆర్ పెరిగే అవకాశం:

ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాటతీరు గౌరవ ప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంబోధించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. కౌన్సిలింగ్ మేరకు సిబ్బంది మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, తద్వారా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పెరిగి సంస్థ ఆదాయం సమకూరేందుకు అవకాశం ఉంటుందని, ప్రయివేటు ఆపరేటర్లవైపు మరలే అవకాశం ఉండదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

వివాహ రిజిస్ట్రేషన్‌కు ఎమ్మెల్యే బిజయ్ శంకర్ దరఖాస్తు

- అభ్యంతరం తెలిపిన మాజీ ప్రియురాలు
- రిజిస్ట్రార్‌కు రాతపూర్వక ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న సోమాలికా

భువనేశ్వర్: తిర్తోల్ నియోజకవర్గం బిజూ జనతాదళ్ ఎమ్మెల్యే బిజయ్ శంకర్ దాస్ వివాహ నమోదు కోసం దరఖాస్తు దాఖలు చేయడంతో దుమారం చెలరేగింది. ఈ విషయం తెలియడంతో అతని మాజీ ప్రియురాలు సోమాలికా డాష్ శనివారం కటక్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యక్షమైంది. మాజీ ప్రియుని వివాహ నమోదు దరఖాస్తు దాఖలపై అభ్యంతర అపీలు దాఖలు చేసినట్లు మీడియాకు తెలిపింది. ఈ మేరకు రాతపూర్వక ఫిర్యాదును సబ్ రిజిస్ట్రార్‌కు సమర్పించింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లా తిర్తోల్‌కు చెందిన బీజేడీ శాసన సభ్యుడు తనతో చేసిన విధంగానే మరో యువతితో పునరావృతం కారాదని ఈ ఫిర్యాదులో వివరించినట్లు పేర్కొంది.

దరఖాస్తు చేసి కనుమరుగు

తనతో వివాహం కోసం ఎనిమిది నెలల క్రితమే ఎమ్మెల్యే వివాహ నమోదు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసి కనుమరుగయ్యాడని సోమాలికా డాష్ ఆరోపించింది. దరఖాస్తు దాఖలు ప్రకారం ఆయన పెళ్లి తేదీకి హాజరవ్వలేదని తెలిపింది. ఈ మేరకు జగత్‌సింగ్‌పూర్ ఠాణా పోలీసులకు ఎమ్మెల్యేపై సోమాలికా ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై తనకు ఇంకా న్యాయం జరగలేదని, నిందిత ఎమ్మెల్యే బిజయ్ శంకర్‌ను ఈపాటికే అరెస్టు చేయాల్సి ఉందన్నారు. అయితే అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సోమాలిక ఆవేదన వ్యక్తం చేసింది. తనకున్న రాజకీయ బలం కారణంగానే అతడు వేరొకరిని పెళ్లి చేసుకోవాలని యోచిస్తున్నాడని పేర్కొంది. తన జీవితాన్ని నాశనం చేసిన తర్వాత మరొక స్త్రీని ఎలా వివాహం చేసుకుంటాడని ప్రశ్నించారు. పోలీసు కేసు పెండింగ్‌లో ఉన్నప్పుడు, ఎమ్మెల్యే మరో మహిళతో వివాహ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేయడం సరికాదని పేర్కొన్నారు. అందువలనే వివాహ రిజిస్ట్రేషన్ కోసం సమర్పించిన దరఖాస్తుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశానని చెప్పారు. అలాగే ఠాణాలో దాఖలు చేసిన ఫిర్యాదు విచారణ పురస్కరించుకుని పోలీసులు తనను వేధిస్తున్నారని ఆరోపించింది. జగత్‌సింగ్‌పూర్‌లో తన స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేయమని పోలీసులు తనను చాలాసార్లు పిలుచినా, పోలీసులు బిజయ్ శంకర్ దాస్‌ను ఇంతవరకు ఎప్పుడూ ప్రశ్నించలేదని పేర్కొంది.

శబరి నదిలో మృతదేహం లభ్యం



పాండు మాడ్కమి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియ సమితి సింగనీగూడ గ్రామానికి చెందిన పాండు మడ్కమి అనే వ్యక్తి మృతదేహం శబరి నదిలో శనివారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. నాలుగు రోజుల క్రితం చేపలు వేటకు వెళ్లిన పాండు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికినా కనిపించలేదు. ఎవరితోనైనా బయటకు వెళ్లుంటాడని ఎదురుచూస్తున్నారు. కానీ మరదిమేట్ల గ్రామం వద్ద ఒక మృతదేహం నదిలో తేలడం గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే అగ్నిమాపక అధికారి లక్ష్మీధర్ జానీ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం పరిశీలించగా అది పాండు మాడ్కమిగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె మృతితో తండ్రి ఆత్మహత్య



మృతుడు గోవిందరావు



వైఎస్సార్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించిన మహిళలు

నరసన్నపేట: అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె (నవ్య) అత్తింటి వేధింపులకు మృతి చెందడాన్ని తట్టుకోలేకపోయిన తండ్రి నారంశెట్టి గోవిందరావు(56) శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. వాకింగ్ కోసం ఇంటి నుంచి ఉదయం 6 గంటలకు బయటకు వెళ్లిన ఆయన సత్యవరం కూడలిలో చెరువులో మునిగిప్రాణాలు బలవన్మరణం చెందారు. దీంతో నరసన్నపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇదే ప్రాంతానికి చెందిన పొడుగు నవ్య(26) బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం విదితమే. కుమార్తె మరణించినప్పటి నుంచీ విషాదంలో మునిగిన గోవిందరావుకు నవ్య భర్త, వారి కుటుంబ సభ్యులు సూటిపోటు మాటలాడటంతో మరింతగా కుంగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమార్తె మృతి చెందిన దుఖం తీరక ముందే భర్త కూడా మరణించడంతో గోవిందరావు భార్య లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానిక జోగిపేటకు చెందిన గోవిందరావు తన కుమార్తె నవ్యకు పొడుగు సంతోష్‌కిచ్చి 2019లో వివాహం చేశారు. అత్తింటి వేధింపులకు తట్టుకోలేక కుమార్తె చనిపోవడం, పోలీసులు అలసత్వంగా కేసు దర్యాప్తు చేయడం, ఇప్పటికీ వారిని అరెస్టు చేయకపోవడంతో గోవిందరావు ఆవేదన చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

రోడ్డుపై బైఠాయించిన మహిళలు..

నవ్య మృతిపై కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం సాయంత్రం నరసన్నపేటలో కళింగకోమట్ల సంఘం ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వెళ్లి వైఎస్సార్ కూడలి వద్ద బైఠాయించారు. నవ్యను అత్త, భర్తలే కిరోసిన్ పోసి చంపేశారని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు మాత్రం నవ్యది ఆత్మహత్య అని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ హత్యేనని, ఈ దిశగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, గోవిందరావు మృతికి సంతాపంగా నరసన్నపేటలో వ్యాపారులు షాపులన్నీ మూసివేసి బంద్ పాటించారు.

కేసు దర్యాప్తు వేగవంతం చేయాలి..

నవ్య అనుమానాస్పద మృతికి సంబంధించి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ జిల్లా ఎస్పీ రాధికతో ఫోన్‌లో మాట్లాడారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నవయసులోనే నవ్య మృతి చెందడం బాధాకరమని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. పోలీసులతో మాట్లాడి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. నవ్య మృతి కేసులో ఎటువంటి అనుమానాలు వద్దని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి తెలిపారు. స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు, వ్యాపారులతో మాట్లాడారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

అమ్మకం వాస్తవం కాదు..


జగనన్న లేఅవుట్ వద్ద విచారణ చేస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డు దగ్గరలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో 'ఇళ్లపట్టాల అమ్మకం' అన్న శీర్షికతో ఒక ప్రధాన పత్రికలో వచ్చిన వార్తా కథనంలో ఎలాంటి వాస్తవం లేదని తహసీల్దారు డి.శ్రీనివాసరావు శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ప్రచురితమైన 'ఇళ్లపట్టాల అమ్మకం' వార్తపై స్పందించిన ఆయన వీఆర్‌వోలతో కలిసి అక్కడికి వెళ్లి, లబ్ధిదారులతో మాట్లాడి, విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 147లో 29 ఎకరాల 60 సెంట్ల స్థలం సేకరించి, లేఅవుట్ వేసి, 1130 ప్లాట్లను తొలి విడత కింద అర్హులకు కేటాయించామన్నారు. ప్రస్తుతం 80 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. రెండో విడత ఇళ్ల స్థలాల పంపిణీకి సిక్స్ స్టెప్ వేలిడేషన్ ద్వారా 481 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వారికోసం దాదాపు 11 ఎకరాల భూసేకరణకు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 80 ప్లాట్లను కేటాయించేందుకు అర్హులను లాటరీ ద్వారా ఎంపిక చేసేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. విచారణలో ఎటువంటి అక్రమ అమ్మకాలు జరగలేదని, ఇళ్లస్థలాల మంజూరు మాత్రమే తమ పరిధిలో ఉందన్నారు. ఖాళీగా ఉన్న ప్లాట్లు ఇస్తాం.. మీకు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ వార్తలో ప్రచురించిన అంశాల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. అలా ఎవరైనా ప్రలోభపెడితే నమ్మి మోసపోవద్దన్నారు. అనధికారికంగా ప్లాట్లు కొనుగోలు చేసినా చెల్లుబాటు కాదన్నారు.

రూ.68 లక్షల అవినీతి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలోని ఆర్పీలు చేసిన అక్రమాల్లో రూ.68 లక్షల మేర అవినీతి జరిగినట్లు టీఎంసీ ఎస్.వి.రత్నం శనివారం వెల్లడించారు. గంగోత్రి, రామసీత, సీతారామ ఎస్‌ఎల్‌ఎఫ్(స్లమ్ లెవల్ ఫెడరేషన్)ల పరిధిలో మొత్తం 78 సంఘాలున్నాయి. జిల్లా పీడీ సుధాకర్ ఆదేశాల మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 36 మంది అధికారుల బృందం దర్యాప్తు నిర్వహించి, నివేదికను అందించిందన్నారు. గంగోత్రి ఎస్‌ఎల్‌ఎఫ్ నిర్వహిస్తున్న రామలక్ష్మి పరిధిలోని సంఘాల్లో ఎటువంటి అవకతవకలు జరగలేదని నిర్ధారించారు. రామసీత ఎస్‌ఎల్‌ఎఫ్‌లోని 27 సంఘాలకు ఆర్పీగా ఉన్న ఎస్.ఉమాదేవి రూ.33 లక్షలు, సీతారామ ఎస్‌ఎల్‌ఎఫ్‌లోని 25 సంఘాలకు ఆర్పీగా విధులు నిర్వహిస్తున్న పి.సంధ్య రూ.35 లక్షల మేర స్వాహా చేసినట్లు గుర్తించామన్నారు. ఈ మొత్తం అంతా సీసీఎల్ (క్యాష్ ఆన్ క్రెడిట్ లోన్) రూపంలోను, రుణాల వాయిదా సొమ్ము సభ్యుల నుంచి తీసుకుని, బ్యాంకుకు కట్టకుండా వారి పొదుపులో నుంచి రుణాల ఖాతాకు జమచేయడం ద్వారా నగదు పక్కదారి పట్టించారని తెలిపారు. ఈ మొత్తాలను సభ్యులకు తెలియకుండా జాగ్రత్తపడుతూ లోను, పొదుపు పుస్తకాలతో పాటు తీర్మానాల పుస్తకాలు సైతం ఆర్పీల వద్దే ఉంచుకున్నారని వివరించారు. మొత్తం నివేదికలను సోమవారం జిల్లా పీడీ కార్యాలయానికి తీసుకువెళ్లనున్నామని, సంఘాల వారీగా ఎంత మొత్తంలో స్వాహా జరిగిందనేది అక్కడ తేలనుందన్నారు. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన రూ. 68 లక్షలతోపాటు గతంలో మరో ఆర్పీ రూ.18 లక్షలు అవకతవకలు ఒకే బ్యాంకులో జరగడంతో సభ్యులతో పాటు అధికారులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టరు బోల్తాపడి వ్యక్తి మృతి


బోల్తాపడిన ట్రాక్టరు కింద మృతి చెందిన వెంకటనారాయణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): ట్రాక్టరు బోల్తాపడి గరివిడి మండలం, గొట్నంది గ్రామానికి చెందిన సారథి వెంకటనారాయణ(55)అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. శనివారం ఉదయం తన సొంత ట్రాక్టరుపై మొక్కజొన్న తీసుకువచ్చేందుకు సిరిదేవిపురం వెళ్తుండగా, కొయ్యప్పయ్య మామిడితోట దగ్గర రోడ్డుపై ఆరబెట్టిన జొన్నలను తప్పించేక్రమంలో అదుపుతప్పి, పక్కనే ఉన్న గెడ్డలో ట్రాక్టరు బోల్తాపడింది. ట్రాక్టరు కింద వెంకటనారాయణ ఇరుక్కుని తీవ్రగాయాలపాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కసిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎల్.దామోదరరావు తెలిపారు.

పాముకాటుతో..


విజయనగరం రూరల్: తంగేటి కృష్ణ(ఫైల్)

విజయనగరం రూరల్: పాముకాటుతో తంగేటి కృష్ణ(55)మృతిచెందిన విషాద ఘటన విజయనగరం మండలంలోని కోరుకొండ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వేకువజామున వరిచేనుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లిన అతడిని పాము కాటువేసింది. ఈ విషయం గమనించిన అతడు గ్రామంలోకి వచ్చిన కొద్ది సమయానికే ప్రాణాలు విడిచినట్లు గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతకు అండగా..

యువత ఉపాధి కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సరికొత్త పథకాన్ని రూపొందించాయి. ఈ పథకం ద్వారా వీలైనంత మందికి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

- 50 శాతం సబ్సిడీతో పశుసంవర్ధక శాఖ పథకాలు
- గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల పెంపకానికి రుణాలు
- గరిష్టంగా రూ.50 లక్షల మేర సబ్సిడీ
- కనిష్టంగా ప్రతీ యూనిట్‌కు 50 శాతం
- ఔత్సాహిక రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- గొర్రెలు, కోళ్లు పెంపకందారులకు ప్రాధాన్యత
- జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా అమలు


ఇలా పెరటికోళ్ల పరిశ్రమలు కూడా పెట్టుకోవచ్చు

రాజాం: ఔత్సాహిక రైతులకు, గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర పశుసంవర్థక శాఖ, కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ లైవ్ స్టాక్ మిషన్ సంయుక్తంగా సరికొత్త పథకాన్ని రూపొందించాయి. మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు వంటి జీవాల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీ వంటి వాటి ద్వారా ఉపాధి కల్పించేందుకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాయి. తద్వారా పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి పెంచి, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ఔత్సాహికులు ముందుగా ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలి.

యూనిట్ ఆధారంగా రాయితీ

500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా గొర్రె లేదా మేకపిల్ల ఉత్పత్తి, పోషణ చేపడతారు. ప్రాజెక్ట్ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.50 లక్షల రాయితీ ఇస్తున్నారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేస్తారు.

- కోళ్ల అభివృద్ధి పథకంలో భాగంగా తక్కువ వ్యయంతో కూడిన సాంకేతికతతో యూనిట్‌కు ఆర్థిక సాయం అందిస్తారు. వెయ్యి కోడిపెట్టలు, 100 కోడి పుంజులతో పెరటి కోళ్ల యూనిట్, కోడి పిల్లల ఉత్పత్తి, పొడుగు కోళ్ల యూనిట్ల విలువ రూ.50 లక్షలు అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.25 లక్షల రాయితీ ఇస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ ఇస్తారు.
- 100 ఆడపందులు, 10 మగ పందులతో యూనిట్ ఏర్పాటు చేయవచ్చు. ప్రాజెక్ట్ విలువ రూ.60 లక్షలు అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.30 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకన్నా తక్కువ ప్రాజెక్ట్ విలువ ఉంటే, 50 శాతం రాయితీ, అలాగే ఆడ పందులు 50, మగ పందులు 5 యూనిట్‌గా చేసుకుంటే గరిష్టంగా రూ.15 లక్షల వరకూ రాయితీ వస్తుంది.
- పశుగ్రాసం, దాణా అభివృద్ధి పథకంలో సైలేజీ తయారీ, పశుగ్రాస దిమ్మల తయారీ, సమీకృత దాణా తయారీ యూనిట్లకు ఆర్థిక సాయం చేస్తారు. యూనిట్ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.50 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ అందిస్తారు.

ఎంపిక ఇలా..

అనుభవం ఉన్న వ్యక్తిగత పశు పోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, సెక్షన్-8 కంపెనీల నుంచి అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. లబ్ధిదారు సంబంధిత ప్రాజెక్ట్‌లో శిక్షణ పొంది ఉండాలి. ప్రాజెక్ట్ నిర్వహణపై అవగాహన అవసరం.

- మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్ట్ నివేదిక తయారీ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- రాయితీ పోనూ మిగిలిన యూనిట్ విలువను బ్యాంకు రుణంగా పొందడానికి అవసరమైన పత్రాలు సమర్పించాలి. బ్యాంకు అనుమతి ఉండాలి.
- సొంత భూమి ఉండాలి. కౌలు భూమి ఉన్నా పర్వాలేదు. వీటిని రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. నిబంధనల ప్రకారం అర్హతలున్న వారికి ఎంపిక చేసి, జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌కు పంపిస్తుంది.

యూనిట్ల వారి రాయితీ వివరాలు..

గొర్రెలు/మేకల ఫాం (యూనిట్)	రాయితీ
100 గొర్రెలు/మేకలు + 5 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.10 లక్షలు
200 గొర్రెలు/మేకలు + 10 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.20 లక్షలు
300 గొర్రెలు/మేకలు + 15 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.30 లక్షలు
400 గొర్రెలు/మేకలు + 20 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.40 లక్షలు
500 గొర్రెలు/మేకలు + 25 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.50 లక్షలు

చాలా మంచి పథకం



జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం చాలా మంచిది. కొత్తగా జీవాల పరిశ్రమపై దృష్టి సారించే నిరుద్యోగ యువతకు ఉపాధినిస్తుంది. బాగా వినియోగించుకుంటే మంచి లాభాలు పొందవచ్చు. సొంత పెట్టుబడితో జీవాల ఉత్పత్తి పరిశ్రమ పెట్టి లబ్ధి పొందుతున్నాం. – దూబ రమేష్‌బాబు, యువ రైతు, కాగితాపల్లి, రేగిడి మండలం

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు



జీవాల పరిశ్రమ పెట్టాలనుకునే వారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి. వీటికి నిర్ధిత గడువు ఇంకా ఇవ్వలేదు. ఈ నెలాఖరులోగా పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. 50 శాతం రాయితీ వచ్చేలా గొర్రెలు, కోళ్ల పరిశ్రమలు పెట్టుకుంటే మంచిది. జిల్లాలో గొర్రెలు, కోళ్లకు మంచి డిమాండ్ ఉంది. జిల్లా వ్యాప్తంగా ఎంతమందైనా దరఖాస్తు చేసుకోవచ్చు. – బొత్స జయప్రకాష్, పశుసంవర్ధక శాఖ ఏడీప, రాజాం

- రెండు దఫాలుగా 50 శాతం సబ్సిడీ విడుదల
- బ్యాంకు మొదటి దశ రుణాన్ని లబ్ధిదారుకు అందించిందనే విషయాన్ని ధ్రువీకరించుకున్న తరువాత మాత్రమే మొదటి దఫా సబ్సిడీ మొత్తాన్ని సంబంధిత బ్యాంకుకు జమ చేస్తారు. ఆ సబ్సిడీని లబ్ధిదారుని ఖాతాలో బ్యాంకు జమ చేస్తుంది.
- ప్రాజెక్ట్ మొత్తం పూర్తయిన తరువాత అధికారులు ధ్రువీకరించుకుని రెండో దఫా సబ్సిడీని రిలీజ్ చేసి, లబ్ధిదారులను అర్హులుగా పరిగణిస్తున్నారు.

అంతర్జాతీయ టెన్నీకాయిట్ పోటీల్లో మౌనిక ప్రతిభ


అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో సాధించిన పతకంతో రెడ్డి మౌనిక (కుడి నుంచి మొదటి అమ్మాయి)

విజయనగరం: అంతర్జాతీయ స్థాయిలో టెన్నీకాయిట్ పోటీల్లో విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన రెడ్డి మౌనిక అరుదైన ఘనత సాధించింది. గత నెల 30 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు సౌత్ ఆఫ్రికా వేదికగా జరిగిన పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెడ్డి మౌనిక కాంస్య పతకం దక్కించుకుంది. రాష్ట్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ జట్టులోకి అర్హత సాధించగా... నగరంలోని కేఎల్‌పురం ప్రాంతానికి చెందిన మౌనిక ఐదోసారి జరిగిన అంతర్జాతీయ స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైన వారిలో ఒకరు కావటం విశేషం. జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచటంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించటం ద్వారా జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పిన మౌనికను జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ప్రతినిధులు, పలు క్రీడా సంఘాలు అభినందించాయి.

సిరిమాను సాక్షాత్కారం


పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: సిరుల తల్లి సాక్షాత్కరించింది. ప్రతీ ఏటా అమ్మవారి పందిరిరాట వేసిన తర్వాత సిరిమాను పూజారి కలలో కనిపించి తాను అధిరోహించే సిరిమానును చూపిస్తుంది. ఈ ఏడాది నెల్లిమర్ల మండలం జరజాపు పేట గ్రామం రామమందిరం వీధిలో ఉన్న తుమ్ము అప్పారావు కల్లాల్లో సిరిమాను, ఇరుసుమాను సాక్షాత్కరించిందని ఆలయ కార్యనిర్వహణాధికారిణి కెఎల్. సుధారాణి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ముహూర్తం ప్రకారం అమ్మవారి సిరిమాను, ఇరుసుమానులకు బొట్టుపెట్టే కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సిరిమాను ఉన్న వారి కుటుంబ సభ్యులతో చర్చించామన్నారు. ఇదిలా ఉండగా అమ్మవారు జరజాపుపేటలో సాక్షాత్కరించడంతో గ్రామస్తులు సంబరపడుతున్నారు. తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు.

ఇంటర్మీడియెట్ మార్కుల జాబితాలు సిద్ధం

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జూనియర్ కళాశాలలో చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల జాబితాలు స్థానిక ఇంటర్ బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ శనివారం తెలిపారు. విద్యార్థుల మార్కుల జాబితాలను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకెళ్లి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఆదివారం నుంచి మార్కుల జాబితాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. విద్యార్థులకు మార్కుల జాబితాలను అందజేయని పక్షంలో ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పైడితల్లి నిత్యాన్నాదానానికి రూ.2లక్షల విరాళం


దాతల నుంచి రూ.2లక్షల విరాళం అందుకుంటున్న ఆలయ ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీపైడితల్లి అమ్మవారి నిత్యాన్నాదానానికి రూ.2 లక్షలు విరాళాన్ని ధర్మపురికి చెందిన అనిల్‌కుమార్, లక్ష్మీ సుకన్యలు అందజేసినట్లు ఆలయ ఈఓ సుధారాణి శనివారం తెలిపారు. మానుకొండ వెంకటనారాయణ, కాళిబాబుల జ్ఞాపకార్థం అమ్మవారి నిత్యాన్నాదానానికి విరాళాన్ని సద్వినియోగం చేయాలని కోరారన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని, మరింతగా సహకరించాలని కోరారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని జీవితం గడపాలి

- ఎస్పీ దీపికా పాటిల్


ర్యాలీలో ఎస్పీ దీపికా పాటిల్ తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితం గడిపేందుకు అందరూ ప్రయత్నించాలని ఎస్పీ దీపికా పాటిల్ సూచించారు. జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా స్థానిక జేఎన్‌టీయూ జంక్షన్ నుంచి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు శనివారం నిర్వహించిన ర్యాలీని ఎస్పీ ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. ప్రతిఒక్కరూ శారీరకంగానూ మానసికంగానూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. నిద్రలేమి, ఒత్తిడి కారణంగా మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా మానసిక సమస్యతో బాధపడితే ఆ సమస్యను ప్రాథమిక దశలోనే చికిత్స ద్వారా అధిగమించాలన్నారు. అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో మానసిక ఒత్తిడి నుంచి బయటపడే మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల, వైస్ ప్రిన్సిపాల్ సునీత, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలాసునందని పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్యసేవలు

- మంత్రి బొత్స సత్యనారాయణ


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహణపై సూచనలు చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

మెంటాడ(గజపతినగరం రూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజల వద్దకే వైద్యసేవలు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని పురిటిపెంట గ్రామసచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి, అక్కడ వారికి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఆయన రోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇప్పటికే గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యారోగ్య సిబ్బందిని పంపించి, వైద్యసేవలందిస్తున్నారన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట గ్రామాల్లోనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులు అందిస్తున్నారన్నారు. అలాగే చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం అందేలా చేయడం జరుగుతోందన్నారు. ప్రపంచంలో అమెరికా దేశం తర్వాత మన రాష్ట్రంలో మాత్రమే ఇంటింటికీ వైద్యం అందించే వినూత్న కార్యక్రమం జరుగుతోందన్నారు. శిబిరానికి వచ్చే రోగులను బాగా చూసుకోవాలని, వారికి కావాల్సిన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఇదిలా ఉండగా, వైద్యశిబిరం నిర్వహణలో లోపాలుండడంపై మంత్రి మండిపడ్డారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులు రోగులకు పంపిణీ చేయకపోవడంపై తహసీల్దారు అరుణకుమారిని నిలదీశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. మరోసారి ఇటువంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని, లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, జెడ్పీటీసీ జి.తవుడు, మండల ప్రత్యేకాధికారి రమేష్, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు కళావతి, రాగలత, కార్యదర్శి జనార్దన్, వైద్యులు సాయికృష్ణ, తనూజరాయ్, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

ఒక్కటి చేస్తున్నారు..

- విడిపోయే వారిని ఒక్కటి చేస్తున్న కలెక్టరేట్ గృహహింస విభాగం
- కుటుంబ కలహాలతో వచ్చిన వారికి కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారం
- ఇప్పటివరకు వివిధ సమస్యలతో వచ్చిన వారు 898 మంది
- కౌన్సిలింగ్ ద్వారా 166 మంది.. కోర్టు ద్వారా మరో 90 మందిని కలిపారు..
- కేసు ఉపసంహరించుకున్న వారు 157 మంది


విడిపోవాలనుకుంటున్న దంపతులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సోషల్, లీగల్ కౌన్సిలర్లు(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: కుటుంబ కలహాలతో విడిపోదామనుకుంటున్న దంపతులను ఒక్కటి చేస్తున్నారు కలెక్టరేట్ గృహహింస విభాగం సిబ్బంది. సమస్య ఏదైనా వారిని ఆశ్రయిస్తే చాలు పరిష్కారం దొరుకుతుందన్న భరోసాను బాధితులకు ఇస్తున్నారు. భార్యాభర్తలకు పలు దఫాలు కౌన్సిలింగ్ ఇచ్చి, వారి సమస్యపై వారికే అవగాహన కల్పిస్తున్నారు. వారి అపార్థాలను వారే తెలుసుకుని, ఒకరినొకరు చక్కగా అర్థం చేసుకుని, మంచిగా జీవించేలా వారికో కొత్త జీవితం ప్రసాదిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. తెర్లాం మండలానికి చెందిన ఓ మహిళకు అదే మండలానికి చెందిన వ్యక్తితో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరిద్దరూ తిరుపతిలో ఉండేవారు. ఆషాఢానికి ఆ మహిళను కన్నవారింటికి పంపించి, మళ్లీ తిరుపతి తీసుకువెళ్లలేదు. దీంతో ఆమె కలెక్టరేట్‌లోని గృహహింస విభాగాన్ని ఈ ఏడాది మే నెలలో ఆశ్రయించి, సమస్యను విన్నవించుకుంది. గృహహింస విభాగం కౌన్సిలర్లు భార్యాభర్తలిద్దరినీ పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చి, నచ్చజెప్పారు. ఆ దంపతులిద్దరినీ ఒక్కటి చేశారు. ఇదిలా ఉండగా, ఎస్.కోట మండలానికి చెందిన మహిళకు పూసపాటిరేగ మండలానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరి కాపురం కొన్నాళ్ల పాటు సజావుగానే జరిగింది. ఆ తర్వాత అతడు భార్యను కొట్టడం, తిట్టడం చేస్తూ హింసించేవాడు. దీంతో బాధిత మహిళ గృహహింస విభాగాన్ని ఆశ్రయించి, ఆమె పడుతున్న బాధను చెప్పుకుంది. అక్కడి కౌన్సిలర్లు వారిద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి, మళ్లీ వారు యథావిధిగా వారి జీవితం ప్రారంభించేలా చేశారు. ఇలా భర్తతో గానీ అత్తమామలతో గానీ వేధింపులకు గురైన వారు గానీ, గొడవల కారణంగా విడిపోయేందుకు సిద్ధమైన వారు గానీ కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గృహహింస విభాగంలో తమ సమస్య చెప్పుకుంటే చాలు అక్కడి సోషల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్, ఇద్దరు హోంగార్డులు కలిసి వారి సమస్యకు చక్కని పరిష్కారం చూపుతూ వారు కలసిమెలసి జీవించేలా చేస్తున్నారు.

కౌన్సిలింగ్ ఇలా..

ఫిర్యాదు స్వీకరించిన వెంటనే బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులను కౌన్సిలింగ్‌కు పిలుస్తారు. ఒకసారి జరిగే కౌన్సిలింగ్‌లో రాజీపడని వారికి పలు దఫాలుగా కౌన్సిలింగ్ ఇస్తారు. సాధ్యమైనంత వరకు కౌన్సిలింగ్ ద్వారా భార్యాభర్తలను కలిపే ప్రయత్నం చేస్తారు. అయినప్పటికీ రాజీకి రాని వారి సమస్య పరిష్కారానికి ఉచితంగా కోర్టులో కేసు వేస్తారు. కోర్టుకు వెళ్లిన తర్వాత కొంతమంది, వెళ్లకు ముందే ఒకరినొకరు అర్థం చేసుకుని మరికొంతమంది కలిసిపోతున్నారు. ఆనందంగా జీవిస్తున్నారు.

2006లో గృహహింస విభాగం ఏర్పాటు..

జిల్లాలో 2006లో గృహహింస విభాగం ఏర్పాటైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు 898 మంది గృహహింస విభాగాన్ని ఆశ్రయించి, న్యాయం పొందారు. కౌన్సిలింగ్ ద్వారా 166 మంది, కోర్టు కేసుల ద్వారా 90 మంది, కోర్టు కేసు ఉపసంహరణ ద్వారా మరో 123 మంది కలిశారు. మొత్తం ఈ తరహా కేసులు 607 కోర్టులో ఉండగా, 342 కేసులు తుదితీర్పుకు వచ్చాయి. మరో 141 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

భార్యాభర్తలను కలపడం సంతోషం..



కుటుంబ కలహాలతో తమ దగ్గరకు వస్తున్న భార్యాభర్తలను కలుపుతుండడం చాలా సంతోషాన్నిస్తోంది. ముందుగా వారికి కౌన్సిలింగ్ ఇస్తాం. కలసిమెలసి ఉండడం ద్వారా ఉండే ప్రయోజనాలను వివరిస్తాం. చాలామంది కౌన్సిలింగ్ అనంతరం ఒక్కటవుతున్నారు.
–జిల్లెల రజని, సోషల్ కౌన్సిలర్.


ఉచిత న్యాయసహాయం అందిస్తాం..



కౌన్సిలింగ్ ద్వారా రాజీపడని వారికి ఉచితంగా న్యాయసహాయం అందేలా చూస్తాం. కోర్టులో కేసు వేసి, వారికి సత్వర న్యాయం దొరికేలా చర్యలు తీసుకుంటాం. కోర్టులో కేసుల తర్వాత కేసుల మధ్యలో కూడా చాలామంది రాజీకి వచ్చి, కలిసిపోతున్నారు.
జి.మాధవి, లీగల్ కౌన్సిలర్.

నేటినుంచి అండర్-19 క్రికెట్ టోర్నీ

- అంపైర్లు, స్కోరర్ల భవనాన్ని ప్రారంభించిన ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్ గోపీనాథ్‌రెడ్డి


విజ్జీ స్టేడియంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విజయనగరం రూరల్: నగరంలో బీసీసీఐ(భారత క్రికెట్ నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో జరిగే అండర్-19 మహిళల వన్డే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక విజ్జీ స్టేడియంలో అంపైర్లు, స్కోరర్ల కోసం మైదానంలో కొత్తగా నిర్మించిన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆధునికీకరించిన డైనింగ్, డ్రెస్సింగ్ రూమ్‌లు, ఇతర సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే మైదానాన్ని చూసి, క్రీడాకారిణులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, టోర్నమెంట్ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్.ఎన్ రాజుకు సూచించారు. ఈ-గ్రూప్‌లో ఉన్న బరోడా, మధ్యప్రదేశ్, కేరళ, మిజోరం, అస్సాం, బీహార్ రాష్ట్రాల జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా పరిధిలోని విజ్జీ స్టేడియం, నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానం, కందుకూరి క్రికెట్ మైదానంలో ఈ వన్డే లీగ్ మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ జి.వి.సన్యాసిరాజు, కన్వీనర్ పి.దేవవర్మ, జిల్లా సెలక్టర్ పి.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.